యూరియా కోసం ఇక్కట్లు

- ఉదయం నుంచే షాపుల వద్ద బారులు
- ఆందోళనలో అన్నదాత


దౌల్తాబాద్‌లో యూరియా కోసం ఎగబడిన రైతులు

హత్నూర(సంగారెడ్డి): యూరియా కోసం రైతులు యుద్ధం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మంగళవారం హత్నూర మండలం దౌల్తాబాద్ ఎవురుల దుకాణానికి యూరియా రావడంతో ఉదయం నుంచే రైతులు పెద్ద ఎత్తున షాపు ఎదుట గుమ్మిగూడారు. షాపు తెరిచి యూరియా ఇవ్వడం ప్రారంభించడంతో క్యూలైన్ లేకపోవడంతో ఒకరిని ఒకరు తోసుకుంటూ కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా రోజూ వస్తున్నా ఎందుకు దొరకడం లేదంటూ నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీధర్ రెడ్డి అక్కడికి చేరుకొని రైతులను క్యూలైన్‌లో ఉండాలని సూచించినా రైతులు పట్టించుకోలేదు. 20 రోజుల నుంచి యూరియా కోసం తిరుగుతున్నాం.. ఆధార్ కార్డుకు రెండు యూరియా బస్తాలు ఇస్తున్నారు. సాగు చేసిన పంటకు సరిపోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సరిపడా యురియాను సరఫరా చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

పేదల సంక్షేమానికే కొత్త కార్డులు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి


సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: ప్రభుత్వం పేదల సంక్షేమానికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసింది. అలాగే, కార్డుల్లో కుటుంబ సభ్యుల లేని వారి పేర్లను చేర్చి మేలు చేసిందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో నూతన రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఒక్కకొత్త రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ఉచిత కరెంటు, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల అందజేస్తూ పేదల సంక్షేమానికి పాటుపడుతున్నట్లు చెప్పారు. అలాగే, కమలాపూర్ చెరువును పర్యాటక అభివృద్ధి కోసం అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలోని తుర్కపల్లిలో జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేశ్ షెట్కార్ బియ్యం పంపిణీ చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్‌రావు


అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

పటాన్‌చెరు టౌన్: చెత్తను చెత్త సేకరణ వాహనంలోనే వేయాలని ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకటకిషన్ రావు అన్నారు. మంగళవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో ఇంటింటికి తిరిగి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారులపై, కాలనీ వీధుల్లో చెత్తను వేయొద్దన్నారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనానికి అందజేయాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలను కాపాడిన ఎన్‌ఆర్‌ఎఫ్ సిబ్బంది


పశువులను ఒడ్డుకు చేరుస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: మంజీరా నదికి ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతికి నాగల్‌గిద్ద మండలం ఎన్.జి.హుక్రానా శివారులోని మంజీరానది ఒడ్డున మేస్తున్న ఆరు ఆవులు, రెండు గేదెలు వరదలో చిక్కుకుని బయటకు రాలేకపోయాయి. జిల్లా ఫైర్ అధికారి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఖేడ్ అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీధర్, ఎస్ఆర్ఎఫ్ టీం లీడర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఆర్ఎఫ్, క్రీవ్ సిబ్బంది రెండు రోజులుగా శ్రమించి మంగళవారం మూగజీవాలను రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చి వాటి యజమానికి అప్పగించారు. దీంతో యజమాని, గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటిన పీజీహెచ్‌ఎం శైలజ కులకర్ణి

కంగ్టి(నారాయణఖేడ్): ఉపాధిహామీ పథకంలో భాగరంగా మండలంలోని ఆయా పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం ప్రారంభించినట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. కంగ్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ కులకర్ణి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ సుభాష్, ఉపాధ్యాయులు కిఫాయత్‌అలీ, యశ్వంత్, అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిని బదిలీ చేయండి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలు, ఎంపీడీఓ ఎం.ఎం.షరీఫ్‌కు వినతి పత్రం అందజేశారు. పలువురు ఓటర్ల పేర్లను పాత వార్డులోకి మార్చాలని కార్యదర్శికి విన్నవిస్తే పట్టించుకోలేదని మండిపడ్డారు. ఓ అధికార పార్టీ నాయకుడికి అనుకూలంగా విధులు నిర్వహిస్తున్నడని ఆరోపించారు. కార్యదర్శిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల వార్డుల బదిలీ వివరాలు అందజేస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాబితా సవరిస్తామని ఎంపీడీఓ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తుకారాం, మల్లేశం, కార్యకర్తలు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

జహీరాబాద్: మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో ఆయిల్ పామ్ పంటసాగుపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారంహెచ్ఈఓ విఠల్ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంటను సాగు చేయడం ద్వారా దీర్ఘకాలికంగా లబ్ధి పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా సాగు పద్ధతులు, ప్రభుత్వ సబ్సిడీల గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు.

హుండీ ఆదాయం రూ.16 లక్షలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ పరిధిలోని వీరన్నగూడెం గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. లెక్కింపులో శివకేశవ స్వచ్ఛంద సేవా సంస్థ , డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి శశిధర్ గుప్తా, పాలకమండలి చైర్మన్ ప్రతాప్ రెడ్డి సమక్షంలో నిర్వహించారు. గత 51 రోజులకు సంబంధించి 16 లక్షల 58వేల 38 రూపాయల, అన్నదాన హుండి 75.599 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో వెల్లడించారు.

టాస్క్‌లు, కమీషన్ల పేరుతో మోసం

రూ.8.95 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్

పటాన్‌చెరు టౌన్: టాస్క్‌లు కమీషన్‌ల పేరుతో వచ్చిన మెసేజ్‌కు స్పందించి ఓ ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ రూ.8 లక్షల 95 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరుకు చెందిన ఓ ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్‌కు జులై 9న తన ఫోన్‌కు టాస్క్‌లు చేస్తే. కమిషన్ ఇస్తామని మెసేజ్ వచ్చింది. దీంతో ఆ డాక్యుమెంట్ రైటర్ తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో నగదు చెల్లించి టాస్క్‌లు చేయడం మొదలు పెట్టాడు. తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్‌ను సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.8 లక్షల 95 వేలు చెల్లించాడు. దీంతో చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పటాన్‌చెరు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఒకరికి రూ.2 వేలు, మరోకరికి రూ.1500, మరో ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు: హరీశ్ పవార్

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని అన్నీ గ్రామాలు, తండాలకు చెందిన రైతులు ప్రభుత్వం అందజేయనున్న రాయితీ వ్యవసాయ పరికరాల కొనుగోలు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఏఓ హరీశ్ పవార్ తెలిపారు.ఈ నెల5న దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉన్నట్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం రాయితీ, ఇతరులకు 40 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారులకు తగు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎల్‌ఓసీ అందజేత

నారాయణఖేడ్: ఖేడ్ మండలం మాధ్వార్ తండాకు చెందిన తుకారాం నాయక్‌కు ఆస్పత్రి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1.50 లక్షల మంజూరుకు సంబంధించి లెటర్‌ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) ఉత్తర్వు జారీ అయింది. ఉత్తర్వును మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు.

400 ఎకరాల్లో పంటలు నష్టం


పత్తి పంటను పరిశీలిస్తున్న సత్యనారాయణ

రాయికోడ్(అందోల్): రాయికోడ్ మండలంలో 400 ఎకరాల్లో పత్తి, పెసర, మినుము తదితర పంటలకు నష్టం వాటిల్లిందని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ అన్నారు. మండలంలోని సింగితం గ్రామంలో పలువురు రైతుల పంటలను ఏఓ సారికతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 400 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికలు సమర్పించామన్నారు. త్వరలో పూర్తిస్థాయి పంటలను పరిశీలించి జరిగిన మొత్తం పంటల నష్టంపై నివేదిక సమర్పిస్తామన్నారు. అధిక వర్షాలతో పంటలకు సోకే తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట పొలాల్లోని వర్షం నీటిని బయటకు పంపించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నాం..


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని కార్పొరేటర్ పుష్ప అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సాయిజ్యోతి నగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న భూగర్భడ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నిత్యం కాలనీల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అశ్విన్‌గౌడ్, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, సత్తయ్య గౌడ్, రాజనర్సింహ, బలరాం , పెంటయ్య పాల్గొన్నారు.

కేసీఆర్‌ను అప్రదిష్టపాలు చేసేకుట్ర


పటాన్‌చెరు: అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు


వట్‌పల్లి(అందోల్): ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన

పటాన్‌చెరు: కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని అని, సీబీఐకి అప్పగించడం అంటే... ప్రాజెక్టును మూసివేయడానికి కాంగ్రెస్–బీజేపీలు కలిసి చేస్తున్న కుట్రలో భాగమని బీఆర్ఎస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం డివిజన్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు పార్టీ శ్రేణులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదర్శ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ నదీ జలాలను ఇతర రాష్ట్రాలకు తరలించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, సీజేఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జోగిపేటలో..

జోగిపేట(అందోల్): కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించినందుకు నిరసనగా జోగిపేటలో మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీని అప్రతిష్టపాలు చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి సీబీఐకి కేసును అప్పగించారని పార్టీ నాయకులు ఆరోపించారు.

హామీలు నెరవేర్చాలి

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కమీషన్‌లు, సీబీఐ అంటూ కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం వట్‌పల్లిలో నిరసన చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతులకు వరప్రదాయని మారిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మీద దుష్ప్రచారం చేస్తుందన్నారు.

ఖేడ్‌లో బీఆర్ఎస్ ధర్నా, రాస్తారోకో

నారాయణఖేడ్: కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ నాయకులు అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఖేడ్‌లో బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

రాయికోడ్(అందోల్): సీబీఐ విచారణను నిరసిస్తూ రాయికోడ్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. గ్రామ ప్రధాన కూడలి వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీరును తప్పుపట్టారు.

బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ సంబరాలు

జిన్నారం (పటాన్‌చెరు): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దక్కిందని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు వడ్డే కృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు తీర్మానించడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. బీసీల పక్షపాతిగా వారి గుండెల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరగని ముద్ర వేశారని హర్షం వ్యక్తం చేశారు. దీంతో బీసీలకు సామాజికంగా, రాజకీయంగా సరైన న్యాయం జరుగుతుందన్నారు. గతంలో బీసీలను అడ్డు పెట్టుకుని వారి ఓట్లుతో అధికారం దక్కించుకున్న పార్టీలు ఉన్నాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల సంపూర్ణ పద్దతు కాంగ్రెస్‌కి దక్కనుందని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారి ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం నిజాంపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడుగా అజ్జర్, ఉపాధ్యక్షుడుగా నవీన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా జీడీ. చంద్రకాంత్‌గౌడ్, కోశాధికారి బండారి సిద్ధరాములు, సహాయ కార్యదర్శిలుగా బాలరాజ్, శ్రీకాంత్, సలహాదారులుగా భైరవరెడ్డి, భరత్ రెడ్డి, ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిజాంపేట మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా అజ్జర్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జర్నలిస్టు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా పాత్రికేయులకు డబుల్ బెడ్ రూమ్, ఇళ్ల స్థలాల విషయంలో అందరికీ న్యాయం చేసేలా ముందుకెళ్తామన్నారు.

స్ఫూర్తి ప్రదాతకు నివాళి

మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్ మెంట్ వంటి పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు నింపి మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.


జహీరాబాద్ పట్టణంలో..


నారాయణఖేడ్ నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు


నివాళులర్పిస్తున్న ప్రభుగౌడ్, తదితరులు


పటాన్‌చెరు: వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

సంక్షిప్త వార్తలు

◆ మల్‌చెల్మ చెరువుకు మరమ్మతులు



జహీరాబాద్ టౌన్: భారీ వర్షాలకు తెగిపోయిన మల్‌చెల్మ చెరువుకు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. గ్రామంలోని ఈరన్న వాగు అలుగు వద్ద కోతకు గురై గండిపడింది. చెరువు అలుగు, మత్తడి ప్రమాదకరంగా తయారైంది. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ అధికారులు, తహసీల్దార్ దశరథ్‌లు చెరువును సందర్శించారు. అధికారులు దగ్గరుండి జేసీబీ సహాయంతో ఇసుక బస్తాలు పేరించి గండిని పూడ్చివేశారు.

◆ ఎంపీడీఓ కార్యాలయంలో వినతి

మునిపల్లి(అందోల్): గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని అధ్యక్షుడు ఇమ్మానియేల్ ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రామలింగంకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు.

కొండాపూర్(సంగారెడ్డి): పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సీపీఎం మండల నాయకుడు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కొండాపూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో జీవో నెంబర్ 51 సంవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

◆ కిటకిటలాడిన గణేశ్‌గడ్డ

పటాన్‌చెరు టౌన్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రుద్రారం గ్రామ సమీపంలో కొలువైన గణేష్ గడ్డ దేవస్థానంలో మంగవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని శాకాంబేశ్వరుడిగా ఆలయ అర్చకులు అలంకరించి భక్తులకు దర్శన సౌభాగ్యం కల్పించారు.

◆ బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

జహీరాబాద్ టౌన్: కోహీర్ మండలంలోని గోడిగార్‌పల్లికి చెందిన పలువురు ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. గోడిగార్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు కర్నె బిచ్చప్ప, రాచప్పలు బీఆర్ఎస్ చేరగా పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు పాల్గొన్నారు.

◆ వాహన తనిఖీలకు సహకరించాలి

జిన్నారం (పటాన్‌చెరు): వానదారులు సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిన్నారం ఎస్ఐ హనుమంతు హెచ్చరించారు. పట్టణ కేంద్ర శివారులోని నమాజ్ గడ్డ ప్రధాన రహదారి పక్కన పోలీసు సిబ్బందితో కలిసి ఎస్ఐ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు సరైన పత్రాలు లేకుండా రోడ్డుపైకి వస్తే సీజ్ చేస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

◆ వ్యాధుల నివారణపై అవగాహన

కంది(సంగారెడ్డి): ఆశావర్కర్లు వైద్య సిబ్బందితో కలిసి పనిచేయాలని మండల వైద్యాధికారి సాయి శంకర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రం కందిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి శంకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఆశవర్కర్లు గ్రామాల్లోని ప్రజలకు వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి డెంగ్యూ,మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ వంటి జ్వరాలపై సర్వే నిర్వహించి నివేదికలు అందజేయాలన్నారు.

◆ ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు తమ ప్రతిభను చాటేందుకు మండల స్థాయి క్రీడలు దోహదపడుతాయని ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. మండల పరిధి హద్నూర్‌లో మంగళవారం మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు ప్రారంభించారు. మొదటి రోజున బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు తాలుకా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ కాంగ్రెస్‌తోనే రిజర్వేషన్లు సాధ్యం

పటాన్‌చెరు: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తీసుకురావడం కాంగ్రెస్ ప్రభుత్వ వల్లే సాధ్యమైందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది చారిత్రాత్మక నిర్ణయం అని గత ప్రభుత్వాలు తీసుకోలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం బీసీలకు వరమని తెలిపారు.

◆ ఎస్ఐ సుభాశ్‌కు సీఐగా పదోన్నతి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సుభాశ్‌కు సీఐగా పదోన్నతి లభించింది. దీంతో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆయన యూనిఫామ్‌కు స్టార్‌ను అతికించి అభినందనలు తెలిపారు. అయితే ఇంకా ఎక్కడా విధులు కేటాయించలేదని పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ లోనే ఉన్నట్లు సుభాష్ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి: రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం నూరు మండలం తుర్కల ఖానాపూర్ ,తహర్ ఖాన్ పేట, గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో రాజిరెడ్డి సమక్షంలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్నా సంక్షేమ పథకాలు ఆకర్షితులై ఇతర పార్టీల చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామం అన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నేతలు